# పతివ్రత

శ్రీమతి ఆదుర్తి సూర్యమణి

ఆదోపట్నం. పట్నం అని చెప్పడంలో ఉద్దేశం ఎవరిపనులు వారివి. ఎవరిగోల వారిది. ఒకళ్ళ నొకళ్ళు పట్టించుకోరు. చెడుఅవనీ మంచి అవనీ ఒకళ్ళదాంట్లో ఒకళ్ళ సంప్రసక్తి ప్రశంసాలేదు. పంకరత్రోవని ఒకళ్ళు ఇద్దఱూ వెళ్ళుతున్నా వాళ్ళని పట్టి పట్టిచూసి గోడలమీద రాసి రాసిరంపాన్న పెట్టేతత్వం తక్కువ. టయిము కూడాలేదు. అయితే కొంతదాకామాత్రం తెలుసుకుంటారు ఆత్రోవ మంచిదేకాదు. అల్లామనంవెళ్ళొద్దూ అని. అంత దాకానే పట్టించుకొంటారు.

ఆ పట్నంలో అల్లాంటిచోట హెడ్‌గుమస్తా రామయ్య జీవిస్తున్నాడు. ఆయనజుట్టు ఆనగరంలోనే నెరసింది. అంతే ఆదేంపెద్ద అనుభవంచేత కలిసి పోయి వెలిసి పోయిందనికాదు. కొంచెం యించుమించు చెప్పాల్సివస్తే ఆయనజుట్టు ఆ ఆఫీసులోనే ఆపనిలోనే తీరు తెంపులేని ఆ రాతల్లోనే నెరిసిపోయింది. వయస్సు ఓ నలభైపైగా ఉంటాయి. అరవైఏళ్ళ ముసలితనంఉంది. భార్యా, తనూ ఒక్కగాని ఒక్కకూతురుతో ఉన్నదాంట్లో కలో గంజో త్రాగుతున్నాడు. జీవిస్తున్నాడు. బలం సడలి ఈమధ్య ఈ మధ్య కోపం చికాకూ ఎక్కువయింది అసలు ఒకడిచేతి క్రింద ఉంటూ నాలుగుగోడలమధ్యా దాటకుండా సర్కస్ చేసేవాడికి చిరాకు ఉండనే ఉంటుంది. అదే పెంపు జరిగింది. పోతే ఆయనకోకూతురు రాధ. ప్రాణకోటిలో ప్రతిదానికీ మృగంగానీ. మనిషిగానీ అసలు కదిలేమెదిలే ప్రాణంగల శాల్తీ దేనికేనా హాబీ అంటూ ఒకటి ఉంటుంది. దాంట్లో కష్టం శ్రమా ఇత్యాదులు మర్చిపోయి సుఖపడుతుంది. అల్లాంటిహాబీ అనేకరకాలు, కొందరివి చాలాఖరీదైనవి కూడా ఉంటాయి. రామయ్య గుమస్తా జీవితంలో అలాంటి హాబీ ఏం పెట్టుకో గలడు. అందుకు రాధయే ఆయన హాబీ ఇంట్లో ఉన్నంత సేపూ కూతురుకు కోటుతొడగడం, పంచెకట్టడం మళ్ళీ అప్పుడే పరికిణీ కట్టడం, వోణివెయ్యడం. మళ్ళీ గౌను తొడగడం, గుఱ్ఱం ఎక్కించుకోడం, యిదేవరస. ఇల్లా ఐదేళ్ళపిల్లనుంచీ పెంచుకొచ్చాడు. "మహప్రభో మీరా పిల్లని నెత్తెక్కించు కొంటున్నారు. అదిమీరు వెళ్ళారా యిల్లుదీసి పందిరివేస్తోంది." అంటూ గుమస్తా భార్యగా జీవితం కడుంగడు కొలతల్లో నిర్వహిస్తున్న సుబ్బాయమ్మ రామయ్యముందు నెత్తిమొత్తుకొనేది. "వల్లకాదు పోపుల డబ్బాలో డబ్బులన్నీ తీసియియ్యి, ఓవల్టిన్‌డబ్బా తెస్తాను. అది ఓవల్టిన్‌నే తాగాలి. అది రాణియే రాణీ" అంటూ ఎగసందోసేవాడు పిల్లముద్దును.

"డాడీ వెరిగుడ్ — మమ్మీబేడ్" అంటూ రాధ గెంతేసేది.

రోజులు దొర్లాయి.

రాధ పదునేడేండ్ల పసిడి బొమ్మయింది. రాధ తల్లి సంబంధాలు చూడండీ అంటూ రాద్ధాంతం చేస్తోంది. గుమాస్తాకు కోపం ఎక్కువయింది అసలు యిప్పుడు. "రాధకెన్నేళ్ళే! అసలు రాధని పంపించేసి నువ్వేంరాసుకు తిరుగుదామనే. ఊఁ! జాగ్రత్త" యిట్లాగే. కొంచెం యించుమించు ఐదేళ్ళప్పుడు, రాధఎల్లా ఆడుకొంటుందో యిప్పుడూ అల్లాగే ఆడుకొంటోంది. ఆ యింట్లో ఆ తండ్రితో.

సుబ్బాయమ్మకు వేలువిడిచిన పినతల్లి కూతురొకామె సుభద్ర అనే ఆమె ట్రెయినింగయి గరల్స్ స్కూల్లో తర్డుఫారంవరకూ పాఠాలుచెప్పే మిస్ట్రెస్‌గా ఉంటోంది. ఆమె భర్తకూడా మంచివాడూ, ప్రయోజకుడూను ఆయనకో వంద రూపాయలువస్తాయి. ఆ వందా తనకు వచ్చే వందా పెట్టుకొని ఆ అమ్మాయి యిల్లు చక్కదిద్దుకొంటోంది. అద్దెకొంప ఓ ముప్ప రూపాయలు అద్దె. మిద్దె మీద మంచి పోర్షను.

సుభద్రమ్మ ఉదయమే లేస్తుంది. కాలకృత్యాలు తీర్చుకుంటుంది. దేవుడికీ దేశనాయకులకీ దణ్ణం పెట్టుకుంటుంది. సోఫాసెట్టు గోడ గడియారం శుభ్రపరచుకుంటుంది. భర్తలేచేలోగా కాఫీ కాచి అందిస్తుంది. ఇక్కడ కొంచెం ఆగుదాం! యీకాఫీ అందివ్వడంలో ఆవిడకొక తప్పనిసరి అతిథి ఒకడుఉన్నాడు. కృష్ణ. కృష్ణ సుభద్రకు వరుసకు మేనల్లుడవుతాడు. పేరయితే కృష్ణగానీ అతన్ని చూస్తే అందఱికీ అదే అనబుద్ధి వేస్తుంది. అదే సుభద్రా అంటుంది. "ఏమిటో మీ అమ్మా నాన్న తెలియక చిన్నప్పుడు అల్లాపెట్టారుగాని నీపేరు కృష్ణ యేమిటోయ్! ఏ

అక్రూరుడో అని పెట్టాల్సింది." నిజంకూడా అంతే! కృష్ణ జీవిస్తోన్నది 1955–56 అయినా అతనేదో "అప్పు చెయ్యమంటే మహాపాపమనీ"

"అబద్ధం ఆడడమంటే అంతకన్నా పాపంలేదనీ" యిల్లాంటి మనస్తత్వంతో కొంచెం యించుమించు ప్రహ్లాద చరిత్రలోని ప్రథమ పద్యంలోని భావమై "తన యందు నిఖిల భూతములందు నొకభంగి సమహితత్వంబున జరుగువాడు" గాజీవిస్తున్నాడు. చిన్న వారపత్రికలో పని చేస్తున్నాడు. 125 రూపాయలుదాకా వస్తాయి వచ్చేది ఖాయంగావస్తోంది. దూబరాఖర్చుల ప్రశంసేలేదు సరిగదా దుస్తులదగ్గరనుండి అంథపప్పా యింతచారూ ఏపూట కాపూట కుంపటిమీద పడేసుకొని భోంచేసి వెళ్ళే టంతటి కట్టుదిట్టపు అలవాట్లు అతనివి సుభద్రను ఆకర్షించినవి యివి. అతనిలోని మేనల్లుని బంధుత్వంకాదు. సుభద్ర వాళ్ళుండే ప్రక్క పోర్షన్‌లోనే ఉంటున్నాడు. చిన్న వంటిల్లూ అంటిపెట్టుకుని పడకగదినీ, మంచం కుర్చీ అవీ ఇవీ జాగ్రత్త చేసు కుంటూ వచ్చాడు. సుభద్రా ఆమె భర్తా యితను ఒక ప్రాణంలా ఉంటుంటారు. భోజనానిక్కూడా బలవంతంచేసినా ఎందుకులే అత్తా నే చెయ్యి కాల్చుకుంటూన్నాగా అంటూ నమ్రగా నవ్వుతూ అనేవాడు "ఇంకెంతలే మా అమ్మాయి వచ్చేదాకానే అన్ని వప్పజెపుతావు. జల్షాగా తిరుగుతావు! నవ్వుకునేవాడు.

ముప్వురూకలిసే ఆఫీసులకువెళ్ళేవారు. ఒకోఅప్పుడు ఒకరికి "లీజర్" అయినా శెలవయినా క్యాజుయల్‌శెలవు పెట్టినా కాక ఏదేన్నా జరిగి శెలవుపెట్టి యింట్లో ఉన్నా, రెండుయిళ్ళ తాళంచెవులు యింట్లో ఉండిపోయిన వారి దగ్గరే ఉండేవి – ఇది వీరి జీవితాలు!

ఎన్నేళ్ళు వచ్చినా బరువూ బాధ్యతా లేక కష్టం, సుఖం తెలియని కాలంలోనే గడచిపోయిన పదిహేడేండ్ల రాధమ్మ అమ్మతో చెప్పింది.

"అమ్మా పిన్నివాళ్ళింటికి వెళ్ళిరానే"

"నీకోసం కాచిపెట్టుకు కూర్చుంటుంది–అదేమీ నీలా బలాదూర్లు తిరగదు."

"తిరక్కేం పిన్ని స్కూలుకెడుతుంది"

"ఓయి వెర్రిమొహమా పనిపాటాలేక తిరుగుతుంటేనూ బలాదూరు"

"చాల్లేవే. అంటూ బయలుదేరింది రాధ. కొంచెం ముసురుగా ఉంది. అందుకు గొడుగుకూడా వేసుకు వెళ్ళింది.

పిన్నివాళ్ళింటికి వచ్చింది.

అంతకుముందే సుభద్రమ్మ మొగుడు శంకరయ్య పనిమీద వెడుతూ తాళంచెవులు ప్రక్కని కృష్ణునకుయిచ్చి వెళ్ళాడు.

కృష్ణుడిప్పుడు కిటికీలోంచి చూశాడు. చూచాయగా-బయటకొచ్చాడు–గొడుగువేసుకొని – అటువేపుకు తిర్గి ఉంది రాధ. సుభద్రమ్మకూడా మధ్యాహ్నం గొడుగువేసుకొనే వెళ్ళింది. అందుక్క కృష్ణుడు సుభద్రమ్మే అనుకొన్నాడు. "అత్తానాదగ్గిం ఉందిచెవి" అంటూ దగ్గిర కొచ్చాడు కృష్ణుడు. "అత్తా!" అంటూ వెనుదిర్గింది రాధ. ఆశ్చర్యంగా కృష్ణుడిప్పుడు చూశాడు. గబుక్కుని పాల సీసా నోట్లోంచి తీసేసి బ్రాందిగ్లాసు ముక్కుదగ్గిర పెట్టి నప్పుడయిన పసివాడులా అయిపోయాడు కృష్ణుడు.

"మా అత్తే అనుకున్నాను" చచ్చిపోయి అన్నాడు.

"కళ్ళులేవూ?"

"ఉన్నయ్" కాని గొడుగు అడ్డం.

ముద్దుగాపెరిగి హాయిగాపెద్దదై తనమాటే అన్నివిధాల అన్నిపట్లా చెల్లి చెలామణే అయిన రాధకు, అజ్ఞానంలో తప్పుచేసి తబ్బిబ్బుఅయి పోతున్న అతన్నిచూసి జాలీ నవ్వూ వచ్చాయి.

"ఊ! తాళంచెవులిటుతే!" ధీమాగా అడిగింది.

"మీరు అత్తకు!" అని సందేహంగానే అన్నాడు.

"కూతుర్ని ఇయ్యి" అతను తాళంచెవులు యిచ్చాడు.

రాధలోపలకెళ్ళింది. కూర్చుంది. లేచింది. పుస్తకం తిరగేసింది. తోచలా పచార్లు చేసింది. గ్రామఫోను పెట్టబోయింది. ఆపేసింది. ఆఖరికి తనంత తానేవచ్చి ప్రక్కింట్లోతొంగి చూసింది. కృష్ణుడు కాఫీతో అవస్థపడుతున్నాడు. రెండు కప్పుల్లో పోశాడు గబగబా వస్తూన్నాడు–రాధ ఈ వైపుగా తప్పుకుంది తలుపుమాటుకి. కృష్ణుడు సరాసరి ప్రక్కవాకిట్లోకి వెళ్ళాడు. రాధ అడుగులువేస్తూ వెనుకవెనుక వెళ్ళుతూంది. కృష్ణుడి కాయింట్లో రాధ కనుపించలేదు. నిరాశగా వెనుదిర్గాడు. కాఫీ రాధకు గ్రుద్దుకుంది. ఒలికింది. బట్టదాగు అయింది.

"కళ్ళులేవూ?"

"ఉన్నాయ్‌కాని మీరు వెనకఉన్నారు"

"ఉంటే (చీరచూపెడుతూ) పాడుచేస్తావా?"

కృష్ణుడుబాధ పడ్డాడు జాలిగా—

"మీరిక్కడే ఉంటే చక్కగా కాఫీ కాచితెద్దును కానీ యెక్కడికో వెళ్ళిపోయారు"

ఆమె నవ్వింది అతనిముంచి తనాన్కి.

"వెళ్ళిపోలే! గమ్మత్తుచేశాను"

"గమ్మత్తా! అందుకనే అల్లాఅయింది" ఇద్దరూ నవ్వుకొన్నారు. అప్పుడు కృష్ణుడన్నాడు.

"పోనీలెండి కాఫీ త్రాగండి" అందించాడు. ఆమె అందుకొంది. యీ ఘట్టం యీ మాటలూ అవుతున్నంత సేపూ గుడిలో గంటలు మ్రోగుతూనేఉన్నాయ్. ఇక్కడికే ఇప్పటికి సుభద్రమ్మ వచ్చింది.

శాంతంగా జీవించే వాళ్ళకి ఏదృశ్యం చూచినా, అదెంత చిన్నదయినా అందులోంచి ఎదోపెద్ద ఆలోచనా తలంపు వెలువడుతూ ఉంటుంది. సుభద్రమ్మ ఒక్కసారిగా అనుకొంది. "యీచిన్న వాళ్ళిద్దఋూ ఓ యింటి వాళ్ళయి యీ ప్రక్కింట్లోనే కాపురం చేస్తుంటే ఎంత ఆనందంగా ఉంటుంది" ఇప్పుడూ దేవిడీ మ్రోతలు విని పిస్తూనే ఉన్నాయ్ ఆఖరాఖరకు అవి కొంచెం సన్నగిల్లాయ్.

మంచివాళ్ళచే మనం ఏమీ అనిపించలేము అయితే వారంతటవారు అనాలోచితంగా అప్రయత్నంగా ఏమన్నా అంటే, అనుకొంటే అవి నిజం అవుతూంటాయి. అవి నిజం అయేటందుక్కు అక్కడక్కడ వారు తగిన కృషి చెయ్యడం కూడా కద్దు.

మొత్తాన్కి చిరంజీవి రాధ, చిరంజీవి కృష్ణుడు దంపతులయ్యారు. సుభద్రమ్మ అనుకొన్నట్లుగా ప్రక్కఇంట్లోనే రాధా కృష్ణులు కాపురమున్నారు.

కాపురం అయితే చేస్తోంది కానీ, రాధకు పనితనపు అలవాట్లు పోలేదు. ఆలస్యంగా లేస్తోంది. కృష్ణు దేమీ అనడు. అతనికి ఆమె అంటేప్రేమా జాలీ తనే ముందు లేచి కాఫీ అవస్థ పడేవాడు. సుభద్రమ్మ తొంగిచూసేది. చూస్తూనే ఏదో చురక అంటించే సాధారణ తత్వం మనిషి ఆమెకాదు గదా! అందుకు చేతనైనంత వరకూ కృష్ణుడిక్కి సాయపడేది. అప్పటికి రాధమ్మలేచేది. గబగబా మొహం తోముకుని సిగ్గుపడుతూ ఎదరకూర్చుని కాఫీ త్రాగేది. పాపం!

కృష్ణుడికి ఆఫీసు టైముకు వంటకావాలి. అందులో రాధ తబ్బిబ్బయి చెయ్యి కాల్చుకొనేది. కృష్ణుడు తోడ్పడేవాడు.

అందఋూ ఆఫీసుకు వెళ్ళిపోయేవారు. రాధ ఒక్కర్తే ఉండిపోయేది యింటిలో. గుడ్డ లుతికి గుమ్మం బయట ఆవరణలో ఆరకట్టేది. ఆపని అయేది. ఆ పై నేమీ పనుండేది కాదు. తోచేదికాదు. ఒంటరిగా అలాగే బాల్కనీమీదనిలబడే తలపోసుకొనేది. తలపోసుకొనేదేమీలేదు తనుచూచిందే. ఈమధ్య క్రొత్తగా ఎదరి పెద్దింట్లో మేడమీద వాటాలోకి ఏవరో దిగారు. ఆవేళా యీవేళలాగే— యిలాంటి మధ్యాహ్నమే ఆ దిగిన వారిలో ఒకామె, ఎంత వొయ్యారం ఎంతఠీవి బోలెడు నగలూ అవీనీ పెద్దరకంచీరే పెద్దతాన్పూరా నిజమైన నెమిలిసైజు లక్కనెమలీ అవీనీ. వాళ్ళుచాలా ధనికులు ఆయింటివైపే చూస్తోంది. ఆయింట్లోంచి సంగీతం మద్దెలధ్వనులు విన్పిస్తున్నాయ్. అడుగులచప్పుళ్ళూ విన్పిస్తోంటాయ్.

ఇల్లాగే ఇలాంటి వేళల్లో ఉతికిన బట్టలు ఆరేసుకొని ఈ బాల్కనీమీదనుండి చూడటం ఇదేసమయాన అక్కడ ఆ బాల్కనీనుండి పరిచారిక అందించిన పానీయం సేవిస్తూ ఆమే. ఆవగలాడి రాధను చూడటం జరిగాయి. జరిగేవి.

ఈ రోజుల్లోనే రాధ ఆలోచనగా అసంతృప్తిగా కొన్నిపనుల పట్ల అశ్రద్ధ చూపటం అవి కృష్ణుడే చేసుకుపోవడం జరిగాయి.

ఇదివరకులా కాఫీకిఆలస్యంగాలేచి సిగ్గుపడడంపోయి "మనమూ కాఫీ త్రాగుతున్నాం మనంబ్రతికిఉంటున్నాం" అని ఏదో నిరాశా, నిర్లక్ష్యం, బ్రతుకుపట్ల చూపసాగింది. రాధమ్మ పాపం!

ఇల్లాంటివే ఒహటీ అరా గుర్తించిన సుభద్రమ్మ తన భర్తతో "చిన్నవారి దాంపత్యంలో ఏదో తుపాన్ సాగనుంది" అని సూచనగా అన్నది. అదివిన్న శంకరయ్య "ఇల్లా అని నువ్వు ముందే చెప్పేస్తే ఆవచ్చే తుఫాను యింకొంచెం ముందుగానే వస్తుంది. పైగా యీ వేపుగా విసురుతుంది."

"అసికాదండీ దానికేదన్నా మనం ఆదుకోలేమా?"

"వెర్రి! ప్రపంచంలో ఏ ఆపదలో నున్నవార్నయినా ఎవరన్నా ఆదుకోగలరుకానీ- ఎవర్నయితే అసంతృప్తి ఆవహించిందో వార్నెవరూ ఆదుకోలేరు."

"అవు ననుకోండి"

"అనుకోండేమిటే పిచ్చిదానా. నువ్వు అనే రేపువచ్చే ఆ తుఫానుకు అసంతృప్తి ప్రాతిపదికకాదూ!"

"ఊ!"

"అతని జీతం నూట పాతిగ. ఆపిండితో అయే రొట్టెలు ఆమెకీపాటికే తెలియాలే!"

ప్రక్కగదిలో రాధ మంచంమీద అటూ యిటూ దొర్లి "దిక్కుమాలినది ఇన్ని నెలలయింది. రెండు తలగడాలకి దిక్కులేదు"— కింద చాపమీద పడుకొని ఉన్న కృష్ణుడు తన తలక్రింది తలగడా ఆమెకు అందించాడు. ఆమె దాన్ని కాళ్ళక్రింద సర్దుకుంటూ-

"నాబ్రతుకే యిల్లా కాలిపోయిందికాని ఎంతమంది ఎన్నివిధాల సుఖపడటంలేదు."

"ప్రొద్దున్నే ఏదో పెద్ద పనున్నట్లు పోడం. నెల పొడుక్కూ అవస్థపడి నూట పాతిక తేపడం. తల్చుకో, తల్చుకున్నంత అప్పుతెచ్చుకో- సగం దేవుడికిచ్చెయ్" అన్నకథలా అన్నీపోతే అర్ధణామిగలదు- ఓసినీమాఅనా- ఓ నాటకమనా! సరదాలా! చట్టుబండలా- ఛీ!"

కృష్ణుడు బాధపడ్డాడు.

"రాధా! సినిమా చూడాలని ఉందా నీకూ? వెడదామా?"

"వెడదామ్- వెడదామ్. సినీమాలకి వెడతామ్-సెంట్లు రాసుకొంటాం- మీకు వెయ్యిరూపాయలు వస్తాయికదూ" చివుక్కుమంది అతనికి. లేచికూర్చున్నాడు. స్థిమిత పడ్డాడు. "ఏం అనుకుంటే ఏం. ఎవరిఖర్మ వారిది. హాయిగా రాణీల్లా ఉండేవారు లేరూ?—" తలగడా కాళ్ళతో తన్నేసి పడుకొంది రాధ— కృష్ణుడు బెంగగా పడుకొన్నాడు— ఖర్మ!

ఆ ఉదయం సుభద్రమ్మవచ్చి సహాయపడ్తోంది కృష్ణుడికి కాఫీల్లో. వంటల్లో. రాధ లేచివచ్చి బాల్కనీ మీద నుంచుంది. సుభద్రమ్మ ఏదో మాట్లాడబోతే "నాకు తెలుసులే పిన్నీ" అంటూ లోనికి వెళ్ళి మళ్ళీ పడుకొంది.

"మధ్యాహ్నం ఆఫీసు ప్యూను వస్తాడు యీ క్యారియర్ పంపించు"— అందులో టిఫిన్ పెట్టి ఉంచుకొన్నాడు కృష్ణుడు- అదే రాధమ్మకి చెప్పి వెళ్ళిపోయాడు.

ఎదురింటి పనిమనిషి వచ్చి రాధమ్మతో "మా యమ్మగారు రమ్మన్నారు. ఎప్పుడూ మీ మాటే అనుకొంటారు. ఒక్కసారి దయచేయండి" అంటూ చెప్పింది.

"వాళ్ళమ్మగారు గొప్పవారు- నన్ను రమ్మన్నారు" రాధ పొంగిపోయింది.

అక్కడ- ఆయింట్లో సోఫాలమీద వయ్యారంగా వ్రేలాడి కూలబడిన వయ్యారి- ప్రక్కనే టక్కుగా, క్రొత్త చారల పూల పాంటుతో కూర్చుని కీచుగొంతుతో మాట్లాడుతూన్న నటరాజారావు ఉన్నారు.

నటరాజారావు వయ్యారి సుందరిబాయ్‌తో ఇలా అంటున్నాడు "కనిపెట్టిచూడు క్లాసు నిర్ణయించెయ్- ఏక్లాసు అయితే అలాగే డీలుచేద్దాం!"

"నువ్వుండరా- కోలార్ గనిరా ఆపిల్ల" అంటోంది సుందరీబాయ్!"

రాధమ్మ వచ్చింది. నటరాజారావూ సుందరీబాయీ దూర దూరంగా కూర్చున్నారు యిప్పుడు.

సుందరీబాయి రాధను తన బిడ్డలా గౌరవించింది. మాట్లాడింది ఇల్లంతా చూపించింది. స్టెయిన్‌లెస్‌స్టీలు గిన్నెలు- ఎలక్ట్రిక్ స్టవ్‌లు- రేడియో గ్రామ్‌లు- కుషన్ కాట్‌లు అన్నీని. అదొక దేవేంద్ర భవనం. అది రాధ అజ్ఞాన హృదయానికొక అవ్యక్త స్వప్నం! పాపం!

వెర్రిగా చూస్తూ వెళ్ళిపోతోన్న రాధను సుందరీబాయి రేపు రమ్మంది. విందు ఉందీ అంది.

"అల్లాగేనండీ" అంది రాధ. బయటపడింది రాధ. రాధబయటపడడం- వీధి మలుపుకు అప్పుడేవచ్చిన సుభద్రమ్మ చూసింది. ఆమె నెవరో బూతు తిట్లు తిట్టుతూన్నట్లు ఆమె హృదయం జల్లుమంది.

ఇంతకు చాలా ముందుగానే ఆఫీస్‌ప్యూన్ కేరియర్ కోసం వచ్చి వెళ్ళిపోయాడు. అక్కడ ఆకలితో బాధపడుతూ పనిచేసుకొంటున్నాడు కృష్ణుడు.

"రాధా!"

"ఏం పిన్నీ"

"ఎక్కడికెళ్ళావమ్మా"

"ఏం!"

"ఇప్పుడే వస్తూంటే"

"ఎక్కడికేమిటీ- 'ఎంతసేపూ యీ దరిద్రకొంపలో చావలేక అల్లాపోయివచ్చాను"

"కాదమ్మా ఒక్కమాట. నువ్వు రావడంచూశాను. ఆ కొంపకి ఎప్పుడూ వెళ్ళకమ్మా!"

"పిన్నీ నువ్వీమధ్య యిల్లా చాలా అంటున్నావ్. తనకి లేకపోతే ఉన్నవాళ్ళను చూసైనా సంతోషించాలి

ఏం వాళ్ళింటికి వెళ్ళకూడదేం? కాస్త నాలుగైదేళ్ళు లోపలికి పోతూంటే మనం యింకా మిడిసిపడుదుం!"

"పొరపాటమ్మా నువ్వేదో అసంతృప్తి పడుతున్నావ్ గానీ మనకేం లోటమ్మా"

"వల్లకాడు" ధాంమని తలుపు వేసేసుకొంది రాధ. వెనక్కుతిగ్గింది— అక్కడ రెండుమాట్లు పరిచారికలే కాఫీలు యిచ్చారు. యిక్కడ కాచుకోవాలి. ఛీ!-

కుంపట్లో బొగ్గులేసి, యింత కిరసనాయిలుపోసి అంటించింది. అది గుప్‌మంది. మంటలేచింది. రాధకి ఛీతాంగం ఏహ్యం కలిగాయి. కుంపట్ని ఒక్కతాపుతన్ని వచ్చి పడుకొంది.

"నే కాఫీ పెట్టనా రాధా!"

"వద్దు"

"చూడూ"

"చూడను"

ఆమె తలదిందుకు వెళ్ళిపోతోంది. శంకరయ్య వచ్చాడు. యీమె మొహం చూశాడు. అసమర్థురాలి హస్తగతమైన కుంపటి అధోగతి చూశాడు తనగదిలో కెళ్ళి కోటు విప్పుకొంటూ-

"లలాట లిఖితే న పునః ప్రయాతి!"

దిగాలుపడి యింటికివచ్చినకృష్ణుడు- టిఫిన్‌క్యారియర్- తన్నేసిన కుంపటి- పడుకొన్న రాధను చూశాడు.

"రాధా!"

"..........."

"రాధా!"

"..........."

"ఏమన్నా బాధగా ఉందా?"

"ఈ వెధవ సామగ్రితో పడలేను బాబోయ్ స్టెయిన్ లెస్‌స్టీల్ కొనుక్కుందాం!"

"స్టెయిన్‌లెస్‌స్టీల్!" కృష్ణుడు ఆలోచిస్తున్నాడు.

అమర్నాడు రాధ చూస్తోంది. సుందరీబాయి నృత్యం చేస్తోంది. అలసివచ్చి ఆరూపంలో పానీయం త్రాగింది. రాధా త్రాగింది. పరిచారికలు వీవనలు వీస్తున్నారు.

రాధ సాయంత్రం ఇంట్లో అన్నం వండుతోంది. చాలా ఎబ్బెట్టుగా అవస్థపడుతోంది. కృష్ణుడు రెండు స్టెయిన్‌లెస్‌స్టీల్ గిన్నెలతో వచ్చాడు.

"ఛీ! ఛీ! ఒకటీ ఆరానా! అందుకే మనవి ముష్టి బ్రతుకులంటారు!" అంది రాధ.

"ఎవరంటారు?" అని అదమాయించి తమాయిం చేసుకొన్నాడు కృష్ణుడు.

"పౌరుషం ఒకటీ అవతలపారెయ్యక" అంటూ గిన్నెలు విసిరేసింది రాధమ్మ బాధలో పాపం!

"రా....ధా...." కృష్ణుడు మెల్లిగా చల్లబడిపోయాడు.

అమర్నాడు ఎనిమిది గిన్నెలు తెచ్చాడు తెల్లని స్టెయిన్ లెస్‌స్టీల్‌వి——

శంకరయ్యతో కృష్ణుడు మొరపెట్టుకొన్నాడు. నాలుగు ప్రయివేటు ట్యూషన్‌లు యిప్పించాడు శంకరయ్య. ఆపిల్లలు యింటికొచ్చి చదువుకుంటారు.

సుందరీబాయి రాధకు డ్యాన్సు నేర్పుతోంది. రాధా బాగా ఆడుతోంది. మీరు మంచిదుస్తులు వేసుకోవాలి అంటోంది సుందరీబాయి. బట్టల కొట్టులో 400 రూ.ల బట్టలు అరువు యిప్పించింది. కృష్ణుడు బాధపడ్డాడు——

రాధమ్మ కడుపుతోఉంది—— కృష్ణుడు బాధ ఎక్కువవుతోంది.

"నాకు నూటపాతికే జీతం. కొద్దిగానే ప్రయివేట్లు" కృష్ణుడు బాధపడుతున్నాడు. ట్యూషన్ కుర్రవాళ్ళు రాత్రిళ్ళు న్యూసెన్సు అని రాధ దీపాలు ఆర్పేసి పొమ్మంది. అందుకు కృష్ణుడే వాళ్ళయిళ్ళకి పోతున్నాడు. రాత్రిళ్ళు పన్నెండు దాటాక వస్తూంటాడు——

రాధమ్మ ప్రసవించింది. కృష్ణుడు నలుగుర్కి మిఠాయి పంచిపెడదామని నిమ్మతొనలుపొట్లం తెచ్చాడు. అప్పటికే సుందరీబాయి పెద్దరకం లడ్డూలు దీవించి వెళ్ళింది.

"ఆమె యిచ్చేవి తీసుకోకు" అనగల్గాడు కృష్ణుడు.

"నాయిష్టం! ఆవిడ యిచ్చింది నా బిడ్డకోసం. నే తీసుకొంటాను- పంచిపెట్టుకొంటాను. మీరిచ్చినవి ఏడిసి

నట్టున్నాయి" అని నిమ్మతొనల పొట్లం గిరాటుపెట్టింది.

"అవును నేను పెద్దరకం లడ్డూలు తేలేకపోయాను" అంటూ దిగాలు పడ్డాడు కృష్ణుడు—

పిల్లాడికి మూడు నెలలూ వచ్చాయి. రాధమ్మ సుందరీబాయి యింట్లో డ్యాన్సు బాగా చేస్తోంది. చీరెలనీ- ఉయ్యాలనీ- పిల్లవాడికి దానికీ దీనికీ అంతా వెయ్యి రూపాయిలదాకా అప్పుపెట్టింది సుందరీబాయి రాధమ్మ కోసం—

కృష్ణుడు రాత్రిళ్ళూ పగలూ కష్టపడి తెచ్చినదాంతోటి తీర్చలేక బాధపడుతున్నాడు.

"నేనే తీర్చుకుంటాను" అని రాధ తర్జనితో తన ఛాతీ చూపుకుంది.

సుందరీబాయి బాగా రెచ్చగొట్టింది- హైదరాబాద్‌లో ఒక్క ప్రోగ్రాం వేస్తే కొన్నివేలు వస్తాయి అనీ. డ్యాన్సు ప్రోగ్రాం ఆడడం అనేదేం తప్పులేదని నమ్మించింది రాధను. రాధమ్మ నమ్మింది ....... పాపం!

రాత్రి పిల్లాణ్ణి సహితము వదిలి ఒక్కర్తే రాధ మెట్లుదిగి పోతోంది. మెల్లిగా తలుపు తీసుకొని సుభద్ర వెంటబడింది.

"ఎక్కడికి ?"

"హైదరాబాద్. కొంచెం పనుంది"

"వెళ్ళకూడదు"

"ఏం ?"

"పరువు పోతుంది"

ఫెడేలుమంది—

"జాగ్రత్త- నాపరువూ బరువూ నాకు తెలుసు. ఇక నుంచి నావిషయం ఎత్తితే పసివాడిమీద ఒట్టే- గబగబా వెళ్ళిపోయింది రాధ.

రాధ కొట్టిన దవడ తడుముకుంటూ ఘొల్లోమంటోంది సుభద్ర. "క్షేమంగా వెళ్ళిరా తల్లీ" అంటూ కూలబడి పోయింది.

సుందరీబాయీ నటరాజారావూ పట్నం జేరారు రాధతో. పెద్ద బిల్డింగులో రాధ రెస్టుగా పడుకొంది.

సుందరీబాయికి రెండువేల రూపాయిల చెక్కు యిచ్చాడు ఓ నవాబు—

నవాబు బిల్డింగులో తలుపులు వేసి రాధను సమీపించాడు. రాధ లేచి చూచింది. మానంకోసం పెనుగులాడింది. వాణ్ణి కర్రతో కొట్టి పారిపోయి బయట పడింది. కాని. పోలీసులు ఆమెను పట్టుకొని కేసు పెట్టారు. పదిహేనురోజులు శిక్ష అనుభవించి ఇప్పుడు మళ్ళీ ఊళ్లో పడింది. మొగుడూ పసివాడు పూర్తిగాఝప్తికి వస్తున్నారు. గవర్నమెంటు యిచ్చిన ప్యాసుతో యిల్లు చేరుకొంది.

రాత్రి పది గంటలవేళ తన మేడ బాల్కనీ నిండా జనం మూగి ఉన్నారు.

సుభద్ర కనిపిస్తోంది. తను సుభద్రని ఎంతదెబ్బ కొట్టింది. రాధను వెయ్యిమంది గునపంతో పొడిచి నట్టయింది. రాధ విపరీత వేదన అనుభవిస్తోంది....ఖర్మ.

పైన పోగడిన జనం నిరాశగా తలలు వ్రేలాడేస్తున్నారు. రాధ ఏడుస్తూ మెట్లెక్కుతోంది.

అందరూ చీదరించుకున్నారు రాధను.......ఖర్మ!

"వెళ్ళమ్మా మీఆయన నీకోసం ఉన్నాడట" అంటూ చేయిచూపాడు. శవంలాగే ఉన్నాడు గెడ్డం జుట్టూ లోతుకుపోయిన కళ్ళు చిక్కిన దేహంతో కృష్ణుడు. రాధ చేరి కయిచూసి.

ఘొల్లుమంటూ పాదాలమీద పడింది.

పాదాలకడ మంచం కమ్మీపై ఫాలం బ్రద్దలు కొట్టుకొంటుంది.

కృష్ణుడికి ప్రాణంవచ్చింది. బలం వచ్చింది. మెల్లిగా లేచి ఆమె ఫాలం రక్తం కారుతోంటే కల్యాణం బొట్టు దిద్దాడు.

"నువ్వు సుమంగళివే ఎందుకల్లా బాధపడతావ్ రాధా బలాలు పోగేసుకొన్న ఉద్రిక్త కరాలతో ఆమెను హృదయాన్ని తీస్కొని కౌగలించుకొన్నాడు"

"నే పాడైపోలేదండీ! నే పాడైపోలేండీ!"

అంటూ రాధ ఏడుస్తోంది. "పాపం! వెర్రిపిల్ల" అని సుభద్రమ్మ చూస్తోంది.

---